క్లుప్తంగా

ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలి



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

సీటీఆర్ఐ: ఆధునిక ప్రపంచంలో ఇంగ్లిష్ మాట్లాడడం ప్రతి ఒక్కరికీ అవసరమని, ముఖ్యంగా విద్యార్థులు ఆ భాషపై పట్టు సాధించాలని ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ కుమారి అన్నారు. ఆ కళాశాలలో సోమవారం ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు క్రియేటివ్ రైటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శించేందుకు ఇంగ్లిష్‌లో కవితలు రాశారు. అధ్యాపకుడు పీఎస్ఎన్ దుర్గా ప్రసాద్, జె.రవీంద్రనాథ్ ఠాగూర్, బి.జానకి పర్యవేక్షించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎకనామిక్స్ శాఖాధిపతి డీవీకేఎస్ లక్ష్మి, సీవీ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

కంబాలచెరువు: స్థానిక నెహ్రూ నగర్ మున్సిపల్ హైస్కూల్లో ఏపీటీఎఫ్ (1938) జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. దీనికి ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడు వి.అప్పయ్యశాస్త్రి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలన్నారు. కొత్త డీఏలను ప్రకటించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఏ.ఉదయ బ్రహ్మం మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మున్సిపల్ ఉపాధ్యాయుల లాంగ్వేజ్ ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలన్నారు. జిల్లా అధ్యక్షుడు డేవిడ్ లివింగ్‌స్టన్ మాట్లాడుతూ ఆగస్టు నుంచి రావాల్సిన నైట్ వాచ్‌మెన్‌ల జీతాలు వెంటనే విడుదల చేయాలన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ తదితరులు

కంబాలచెరువు: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ)నూతన సంవత్సర క్యాలెండర్, పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సోమవారం ఆవిష్కరించారు. ఈ ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డానియల్ బాబు, రాజమహేంద్రవరం అర్బన్ యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పదో తరగతి స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా ఇవ్వడంపై ఎస్టీయూ నాయకులను అభినందించారు.

టీఎన్‌యూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర కార్యదర్శులు కంచెపు జయరాజు, రిమ్మలపూడి సత్యనారాయణ మూర్తి (ఆర్ఎస్ఎన్), జిల్లా గౌరవ అధ్యక్షులు లజపతిరాయ్, జిల్లా అధ్యక్షులు ఉండవిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

నాదస్వర విద్వాంసుడు హరి కల్యాణ్‌కు సత్కారం

పెదపూడి: హైదరాబాద్‌లో మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న యూత్ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదపూడి మండలం గొల్లల మామిడాడకు చెందిన నాదస్వర విద్వాంసుడు దోమాడ హరికల్యాణ్ యూత్ ఐకాన్ అవార్డు పొందినట్లు సోమవారం తెలిపారు. నాదస్వరంతో దేశభక్తిని చాటినందుకు యూత్ ఐకాన్ అవార్డు అందజేసిందన్నారు. ఈ అవార్డును సినీ నటుడు పృథ్వీరాజ్, హీరోయిన్, డ్యాన్సర్ అక్సాఖాన్, బుల్లితెర నటులు ముంతాజ్ తదితరుల చేతుల మీదుగా అందుకున్నట్లు చెప్పారు.

చూడచక్కగా.. బహుమతి మొక్క

- గిఫ్టెడ్ ప్లాంట్లకు భారీ డిమాండ్
- నూతన సంవత్సరం సందర్భంగా పెరిగిన అమ్మకాలు
- ఆసక్తి చూపుతున్న ప్రజలు
- రూ.50 నుంచి ధరలు ప్రారంభం



కడియం నర్సరీల్లో కొలువుదీరిన బహుమతి మొక్కలు

కడియం: నూతన సంవత్సరం వచ్చిందంటే పూలదండలు, బొకేలకు గిరాకీ పెరగడం సాధారణం. అయితే వినూత్నంగా బహుమతులు ఇచ్చి, తమ గుర్తును పదిలంగా ఉంచుకోవాలనుకుంటున్న వారు ప్రస్తుత ట్రెండ్‌లో మొక్కలను బహుమతిగా ఇస్తున్నారు. నూతన సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కడియం ప్రాంత నర్సరీల్లో గిఫ్టెడ్ ప్లాంట్లకు గిరాకీ పెరిగిందని అమ్మకందారులు చెబుతున్నారు. ముఖ్యంగా వేమగిరి నుంచి పొట్టిలంక వరకు జాతీయ రహదారి వెంబడి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో బహుమతి మొక్కల కొనుగోళ్లు వారం రోజులుగా జోరుగా సాగుతున్నాయి.

ఆకట్టుకునేలా..

చూడచక్కని కుండీలలో పువ్వులు, పండ్లు, అలంకరణ మొక్కలను స్థానిక నర్సరీ రైతులు అభివృద్ధి చేస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి సేకరించిన ఈ మొక్కలను ఇక్కడ పెంచి, వినియోగదారులకు అందజేస్తున్నారు. వీటిలో బోన్సాయ్ రకాలతో పాటు, పండ్ల మొక్కలు, సీజనల్ ఫ్లవర్లు, గులాబీ వంటి రకాలు కూడా ఉంటున్నాయి. గుడ్‌లక్ బాంబో, ఆక్సిజన్ ప్లాంట్, మనీ ప్లాంట్ వంటి ప్రత్యేకమైన మొక్కలను కూడా బహుమతులుగా ఇచ్చేందుకు ఎక్కువగా తీసుకువెళుతున్నారు. వీటిలో ఇండోర్ ప్లాంట్లదే మొదటి స్థానం.

అందుబాటు ధర

బహుమతి మొక్కల ధర కూడా చాలా తక్కువ. కేవలం రూ.50 నుంచి ప్రారంభమవుతుంది. కుండీల నాణ్యత, వాటిలో పెట్టిన మొక్కల రకాలు, సైజులను అనుసరించి రూ.5 వేల వరకూ ఉన్నాయి. వీటిలో రూ.150 నుంచి రూ.500ల మధ్య ధర ఉన్న మొక్కల అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నూతన సంవత్సరం, సంక్రాంతి పండగల నేపథ్యంలో మండలంలోని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పలు నర్సరీల్లో వీటి కోసం ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేసి, కొనుగోలుదారులకు విక్రయిస్తున్నారు.

బొకేలకు ప్రత్యామ్నాయం

ఆకర్షణీయంగా తయారు చేసిన బొకేలకు ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం మొక్కలను బహుమతిగా అందజేస్తున్నారు. బొకేలు ఆ సందర్భంలో మాత్రమే ఉపయోగపడతాయి. అదే మొక్కను ఇస్తే ఇళ్లు, కార్యాలయాల్లో శాశ్వతంగా ఉంటాయన్న అభిప్రాయం వినియోగదారుల్లో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఈ మొక్కలకు ప్రాధాన్యం పెరిగింది. ఏదైనా, ఎక్కడైనా అభినందనలు తెలియజేయాల్సి వస్తే మొక్కలను తీసుకువెళ్లి ఇచ్చేవారి సంఖ్య ఇటీవల అధికమైందని స్థానిక నర్సరీ రైతులు చెబుతున్నారు. మండల కేంద్రమైన కడియంతో పాటు, కడియపులంక తదితర చోట్ల గతంలో బొకేల స్టాళ్లు ఎక్కువగా కన్పించేవి. అయితే ఇప్పుడు మొక్కల స్టాళ్లు పెరిగాయి. బొకేలను నామమాత్రంగా విక్రయిస్తున్నారు. లేకపోతే ఆర్డరుపై మాత్రమే తయారు చేస్తున్నారు.

బహుమతిగా మొక్కలు

ప్రముఖులను కలిసినప్పుడు వారికి మర్యాదపూర్వకంగా మొక్కలను ఇవ్వడం ఇటీవల బాగా పెరిగింది. రెండు, మూడేళ్లుగా బహుమతి మొక్కల అమ్మకాలు పెరిగాయి. వీటి ధర కేవలం రూ.50 నుంచి ప్రారంభమవుతుంది.

– గాద మణికంఠ, గీతాన్విత నర్సరీ, వేమగిరి

ఇండోర్ ప్లాంట్స్ తీసుకువెళుతున్నాం

నూతన సంవత్సరం సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపేందుకు మొక్కలనే తీసుకువెళుతున్నాం. గుడ్‌లక్‌బ్యాంబో, ఆక్సిజన్ ప్లాంట్, మనీ ప్లాంట్స్‌ను ఎంపిక చేశాం. వీటిని ఆఫీసుల్లో పెట్టుకుంటున్నారు. బొకేలతే ఆ రోజే బయట పడేస్తారు.

– వీరాంజనేయులు, మండపేట, మొక్కల కొనుగోలుదారుడు

350 గ్రాముల బంగారం, రూ.2 లక్షల చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న బొమ్మూరు సీఐ కాశీవిశ్వనాథ్

రాజమహేంద్రవరం రూరల్: ఊరు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి ఇంటిలోని 350 గ్రాముల బంగారం, రూ.2 లక్షల నగదు చోరీ చేశారు. వివరాల్లోకి వెళితే.. హుకుంపేట రామకృష్ణ నగర్ ప్రాంతానికి చెందిన గరగా అనంతలక్ష్మీదేవి కలెక్టరేట్‌లో కో ఆర్డినేషన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఆమె ఈ నెల 26వ తేదీ మధ్యాహ్న సమయంలో కాకినాడలో బంధువులు చనిపోతే ఇంటికి, గేటుకు తాళం వేసి వెళ్లారు. తిరిగి ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో తిరిగి వచ్చేసరికి గేటు తాళం వేసినట్టే ఉంది గానీ ఇంటితాళం పగలగొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూడగా బెడ్ రూమ్‌లోని బీరువాలో 350 గ్రాముల బంగారం, రూ.2 లక్షలు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి



పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని పార్కులను ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా తీర్చిదిద్దాలని కమిషనరు అధికారులను కేతన్ గార్గ్ ఆదేశించారు. అలాగే ఎస్ఆర్‌సీపీ పంపింగ్ స్టేషన్ వద్ద గల కన్వెయిర్ బెల్టులను వెంటనే మార్పు చేయాలన్నారు. 10వ డివిజన్ సాయినగర్, 17వ డివిజన్‌లోని సాయికృష్ణ నగర్ పార్కులను సోమవారం ఆయన సందర్శించారు. వాకింగ్ చేస్తున్న వారితో సంభాషించారు. పార్కు నిర్వహణతో పాటు, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాకింగ్ ట్రాక్‌ను సరి చేయాలని, జిమ్ ఎక్విప్మెంటుకు రిపేరు వెంటనే చేయాలన్నారు. తాగునీరు, చిన్నపిల్లల ఆడుకునే పరికరాలు, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. సాయినగర్ పార్కులో కూడా వాకింగ్ ట్రాక్‌ను సరిచేయాలని, మొక్కలు పెంచాలని, ఓపెన్ జిమ్ ఎక్విప్మెంట్ ఏర్పాటుకు అంచనాలు తయారు చేయాలన్నారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మదర్షా అలీ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రీటా, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విరూపాక్షరావు, ఇంజినీరింగ్ సిబ్బంది, ఎమినిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

అధిక శబ్దం కలిగించే సైలెన్సర్ల ధ్వంసం



అధిక శబ్దం చేసే సైలెన్సర్లను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్



సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న రోడ్డు రోలర్

కంబాలచెరువు: నిబంధనలను విరుద్ధంగా మోటారు సైకిళ్లకు ఏర్పాటు చేసిన అధిక శబ్దం గల 502 సైలెన్సర్లను సోమవారం ధ్వంసం చేశారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మోటారు సైకిళ్ల సైలెన్సర్లను డిజిటల్ నాయిస్ లెవెల్ మీటర్ ద్వారా తనిఖీ చేశారు. 80 డేసిబుల్స్‌కు మించి శబ్దం కలిగించే 502 వాహనాలను గుర్తించారు.

ఎస్పీ సమక్షంలో ఆ సైలెన్సర్లను వాహనదారులతో తీయించి రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సైలెన్సర్ల ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోందన్నారు. అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను విక్రయించే షాపులు, వాటిని బిగించే మెకానిక్‌లపైనా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు నబీ, సూరిబాబు, ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వివిధ కేసుల పురోగతిపై ఆరా



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి మాధురి, చిత్రంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్ బాబు

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ప్యానల్ న్యాయవాదులు, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో సోమవారం మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.మాధురి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు వివిధ కేసుల్లో ఉచిత న్యాయ సహాయం అందించేందుకు నియమించిన న్యాయవాదులతో మాట్లాడారు. ఆయా కేసుల పురోగతిని గురించి తెలుసుకున్నారు. క్రిమినల్ కేసులకు సంబంధించి బెయిల్‌కు వేసిన అర్జీల వివరాలపై ఆరా తీశారు. ఈ కేసులను సత్వరం పరిష్కరించాలని, దీనికి సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా జిల్లా న్యాయసేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు.

అర్హుల పింఛన్లు తొలగిస్తే పోరాటానికి సిద్ధం



ముత్యాల పోసికుమార్

ధవళేశ్వరం: దివ్యాంగుల, వృద్ధుల, వితంతువుల, వివిధ సామాజిక పింఛన్ దారులను ఏరివేత కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం మానుకోవాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్లు పెంచామని గొప్పగా చెప్పుకొని, ఇప్పుడు అనర్హులు అనే పేరుతో కోతలు విధించడం సమంజసంగా లేదన్నారు. ప్రభుత్వ వ్యవస్థల్లో భాగమైన వైద్యులను నకిలీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారనే నెపంతో బెదిరించడం శోచనీయమన్నారు. దివ్యాంగులకు అనేక రకాలుగా ఉపయోగపడే సదరం వైద్య క్యాంపులను సుమారు ఐదు నెలలు నిలుపుదల చేయడం, మరలా ఎప్పుడు ప్రారంభించేది చెప్పక పోవడం దివ్యాంగుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న వివక్షను బయట పెడుతుందన్నారు. దివ్యాంగులు ,వృద్ధులు, వితంతువులు, వివిధ సామాజిక పింఛన్‌దారులు ఎవరికైనా అన్యాయం జరిగిన వారి తరపున పోరాటం చేయడానికి వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం సిద్ధంగా ఉంటుందన్నారు.

యాజమాన్య కమిటీల సహకారం అవసరం



శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో వాసుదేవరావు

కంబాలచెరువు: పాఠశాలల ప్రగతికి యాజమాన్య కమిటీల సహకారం అవసరమని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో పాఠశాల యాజమాన్య కమిటీలకు జరిగిన ఒకరోజు జిల్లా స్థాయి శిక్షణ తరగతులను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల విద్య అభివృద్ధి చెందాలంటే ఉపాధ్యాయులతో పాటు పాఠశాల యాజమాన్య కమిటీ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు.

ప్రస్తుతం విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్న సంఘటనలు చూస్తున్నామని, ఉపాధ్యాయులతో పాటు కమిటీ సభ్యులు కూడా వాటి వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. సర్వ శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో డీఆర్పీలుగా శిక్షణ తీసుకున్న వారు సంబంధిత మండలాలలో సమర్థవంతంగా శిక్షణ అందించాలన్నారు. శిక్షణా తరగతులకు రాజమహేంద్రవరం డివిజన్, కొవ్వూరు డివిజన్ పరిధిలోని మండలాల నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఇద్దరు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు డీఆర్పీలుగా శిక్షణకు హాజరయ్యారు. కోర్సు డైరెక్టర్‌గా సమగ్ర శిక్షా జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు వ్యవహరించారు. సమగ్ర శిక్షా ఐఈ కో ఆర్డినేటర్ కనకబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



నగరపాలక సంస్థలో అర్జీలు స్వీకరిస్తున్న ఎంహెచ్‌ఓ వినూత్న

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నట్లు నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వినూత్న పేర్కొన్నారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ తరపున అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ నగరంలో 18 మంది నుంచి అర్జీలను స్వీకరించామన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు రెండు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ పీవీవీ జయసూర్యకుమార్ తెలిపారు. వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

విష వలయం

- సరదా పేరుతో నీచ సంస్కృతి
- పెరిగిపోతున్న అసాంఘిక కార్యకలాపాలు
- అరికట్టకపోతే అనర్థాలే

రాజానగరం: సంస్కృతీ సంప్రదాయాలకు నిలయంగా విరాజిల్లే రాజమహేంద్రవరం పరిసరాలు ప్రస్తుతం అసాంఘిక, అకృత్య కార్యకాలాపాలతో కలుషితమవుతున్నాయి. ఆధునిక పోకడల పేరుతో కొందరు ముష్కరులు పుట్టిన రోజులు, పెళ్లి రోజులు, నూతన సంవత్సర సంబరాల పేరుతో సభ్య సమాజం సిగ్గుపడేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మన సంప్రదాయాలను మసకబారేటట్టు చేస్తున్నారు. ప్రశాంతతకు నిలయంగా ఉండే పల్లెటూర్లలో ఆధునికత పేరుతో విష సంస్కృతిని తీసుకువచ్చి, కలుషితం చేస్తున్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ గుంటూరుకు చెందిన ఎరువుల కంపెనీ యజమాని తమ వ్యాపారులను పెంపొందించుకునేందుకు ఈ ప్రాంతంలో రేవ్ పార్టీకి శ్రీకారం చుట్టినట్టుగా తెలుస్తుంది.

రేవ్ పార్టీ కలకలం

కోరుకొండ మండలం బూరుగుపూడిలోని ఒక ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి రేవ్ పార్టీని నిర్వహిస్తూ కొందరు పోలీసులకు చిక్కారనే సమాచారం ఈ ప్రాంతంలో కలకలం రేపింది. సంక్రాంతి సంబరాలలో నిర్వహించే కోడి పందేలకు దూరంగా ఉండే ఈ ప్రాంతంలో గోవా, హైదరాబాద్‌లలో మాదిరిగా రేవ్ పార్టీలు నిర్వహించడం ఏమిటని అంతా ప్రశ్నిస్తున్నారు.

వ్యాపారాభివృద్ధి కోసమేనా!

నూతన సంవత్సర వేడుకల పేరుతో డిసెంబరు 31 రాత్రి పలుచోట్ల వివిధ రకాల కల్చరల్ కార్యక్రమాలు నిర్వహించడం పరిపాటి. కానీ బూరుగుపూడిలో 30వ తేదీ రాత్రే న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవడం, అందులో కూడా కేవలం 20 మంది కంటే ఎక్కువ లేకుండా ప్లాన్ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇటీవలే బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో సినీ ప్రముఖులు చిక్కుకున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకున్న గుంటూరు చెందిన ఒక ఎరువుల కంపెనీ యజమాని తమ వ్యాపారాభివృద్ధికి డీలర్లను ఆకట్టుకునేలా ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకునే ప్రయత్నం చేశాడనే ప్రచారం జరుగుతుంది. న్యూ ఇయర్ పార్టీలను సరదా కార్యక్రమాలు, పిల్లల డ్యాన్సులు తదితర వాటితో నిర్వహించుకుంటారు. కొందరు మాత్రం మద్యంతో సంబరాలు చేసుకుంటారు. కానీ బూరుగుపూడిలో మద్యంతో పాటు ఆరుగురు అమ్మాయిలను తీసుకువచ్చారు.



పుణ్యక్షేత్రంలో డ్రగ్స్ పార్టీ జరిగిన ప్రాంతం

పుట్టిన వేడుకల్లో డ్రగ్స్ వినియోగం

రాజానగరం మండలం పుణ్యక్షేత్రంలో గత అక్టోబరు 8వ తేదీ రాత్రి జరిగిన ఓ పుట్టినరోజు వేడుకలో డ్రగ్స్ వినియోగం అలజడి సృష్టించింది. ఇక్కడ కూడా పోలీసులు సకాలంలో స్పందించడంతో డ్రగ్స్ తీసుకుంటూ నలుగురు యువకులు పట్టుబడ్డారు. తాడేపల్లిగూడేనికి చెందిన దేవభక్తుని దినేష్‌కు డ్రగ్స్ అలవాటు ఉంది. తనతో పాటే డ్రగ్స్ తాగే మరో స్నేహితుడి ద్వారా ఆన్‌లైన్‌లో వాటిని తెప్పకుని పుట్టిన రోజును వెరైటీగా జరుపుకోవాలనుకున్నాడు. ఇందుకు రాజమహేంద్రవరానికి మారుమూలగా ఉండే భూపాలపట్నం నుంచి జి.యర్రంపాలెం వెళ్లే పుంత రోడ్డులోని సిరాజ్ స్టుడియో స్పేస్ గెస్ట్ హౌస్‌ను ఎంచుకున్నాడు. ఆ రోజు రాత్రి బర్త్ డే పార్టీకి వచ్చిన కుటుంబ సభ్యులు, స్నేహితులను ఆతిథ్యం ఇచ్చి పంపించేశాడు. ఆ తర్వాత తనకు అత్యంత సన్నిహితులుగా ఉండే వేమన విక్టం రాధాగగన్ అనే గగన్, బాలం అజయ్, దువ్వనబోయిన పుష్పరాజులతో కలిసి గెస్ట్ హౌస్ ముందు పార్కు చేసిన కారులో కూర్చుని డ్రగ్స్ మత్తును ఎంజాయ్ చేస్తూ పోలీసులకు దొరికిపోయారు. ఇప్పటికే మన సంస్కృతీ సంప్రదాయాలను కించపరిచేలా కొన్ని తిరునాళ్లు, జాతర్లలో అసాంఘిక నృత్య ప్రదర్శనలు జరుగుతున్నాయి. వీటిని ఆదిలోనే తుంచేయకపోతే మర్రిచెట్టులా విస్తరిస్తాయి. సంప్రదాయాలను మట్టిలో కలుపుతాయి.

సేవా కార్యక్రమాలకు సహకరించాలి



కలెక్టర్ ప్రశాంతికి చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ ప్రశాంతి పిలుపు ఇచ్చారు. జిల్లాలోని దివ్యాంగులకు, వసతి గృహాల్లో వారికి దుప్పట్లు, పరుపులు, దిండ్లు, బెడ్‌మ్యాట్స్ అందించేందుకు జేగురుపాడు శ్రీరామదాసు పేపరు బోర్డ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ నల్లమిల్లి సోమవారం రూ.లక్ష చెక్కును కలెక్టర్‌కు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యత కార్యక్రమాల కింద మానవతా విలువలకు కట్టుబడి ఉన్న వారంతా సహాయం అందించేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి ఎల్.అప్పలకొండ పాల్గొన్నారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి

సీటీఆర్ఐ: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ నిర్వహించిన వ్యాసరచన పోటీలో లాలాచెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వైహెచ్ ఎస్వీ భాను ప్రథమ స్థానం పొందింది. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ బాలికకు కలెక్టర్ రూ.5 వేల చెక్కు అందజేశారు. విద్యార్థినితో పాటు గైడ్ టీచర్ బి.దుర్గాభవాని, ప్రధానోపాధ్యాయుడు ఏ.మల్లేశ్వరరావును అభినందించారు.

నేడు విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

కంబాలచెరువు: స్థానిక ఎస్కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు రాజమహేంద్రవరం అర్బన్‌మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభమవుతుందని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థాయిలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే ఈ ప్రదర్శన జరుగుతుందన్నారు. పాఠశాల స్థాయిలో విజేతలు ఇక్కడ పాల్గొనాలన్నారు.

కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి

ప్రకాశ నగర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శ్యామలా సెంటర్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీనియర్ నాయకుడు నల్లా రామారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మూలస్తంభం అయిన అంబేద్కర్ అంటే బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులకు ఎంత ద్వేషముందో.. షా వ్యాఖ్యలతో తెలుస్తోందన్నారు. నిరసనలో జిల్లా కార్యదర్శి బి.పవన్, పి.తులసి, పూర్ణిమరాజు తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరికి చెస్ ఆర్బిటర్‌గా గుర్తింపు

ప్రకాశం నగర్: చదరంగం కోచ్ దువ్వూరి రాజ్‌కుమార్ సీనియర్ నేషనల్ చెస్ ఆర్బిటర్‌గా గుర్తింపు పొందారు. ఈ మేరకు ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ సంస్థ ఆయనను సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ విషయాన్ని రాజ్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు.

పెట్టుబడులపై అవగాహన

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమం జరిగింది. ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ కళాశాల, కామర్స్ డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీ డాక్టర్ అచ్యుత రామకిషోర్ విద్యార్థులకు పెట్టుబడులపై అవగాహన కల్పించారు.